

మద్యం సీసా కోసం హత్య

- ఆగస్టు 30న పెద్దేముల్ మండలంలో ఘటన
- ఘటనా స్థలంలో దొరికిన పర్స్ ఆధారంగా కేసు ఛేదన
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

-వివరాలు 7 లో

జై గణేశా

గజాననుడి పూజకు ఘన ఏర్పాట్లు



వినాయక చవితి పండగను ఘనంగా జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా వాసులు సిద్ధమయ్యారు. విగ్రహాల ప్రతిష్ఠకు మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పూజ, అలంకరణ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి నెలకొంది. వివిధ రూపాల్లో తయారు చేసిన గణేశ్ విగ్రహాలు అకట్టుకుంటున్నాయి. ఈ సారి విగ్రహాల ధరను గతం కంటే 20 శాతం పెంచేశారు. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మట్టి వినాయకులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేశారు. తొమ్మిది రోజుల పాటు పూజలు చేసే పూజారులకు కూడా విపరీతమైన డిమాండ్ పెరిగింది.

- ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 6

నేడు వినాయక చవితి

- అందంగా ముస్తాబైన మండపాలు
- వాడవాడల విగ్రహాల ప్రతిష్ఠాపన
- సందడిగా మార్కెట్లు
- రకరకాల రూపాల్లో ఆకట్టుకుంటున్న గణనాథులు
- పూజారులకు పెరిగిన డిమాండ్
- పలుచోట్ల ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ




లంబో'ధర'

వినాయ విగ్రహాల ధరలు విపరీతంగా పెరిగాయి. గత ఏడాది కంటే ఈ సారి 20 శాతం ధరలు పెంచేశారు. విగ్రహాల తయారీకి ఉపయోగించే ప్లాస్టరాఫ్ ప్యారిస్, రంగులు, ఇతర ముడిసరుకుల ధరలు భారీగా పెరగటమే ఇందుకు ప్రధాన కారణమని విగ్రహాల తయారీదారులు అంటున్నారు.



సందడిగా మారిన మార్కెట్లు

వినాయక చవితి పండగతో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లన్నీ సందడిగా మారాయి. వినాయకుడికి ప్రీతిపాత్రమైన తుమ్మి ఆకులు, చింతకాయలు, మారేడుకాయలు, తామర ఆకులు, వివిధ రకాల పూజా సామాగ్రి కొనుగోలు చేయడానికి ప్రజలు రావడంతో మార్కెట్లు కిటకిటలాడాయి.



వివిధ రూపాల్లో..

వినాయక విగ్రహాలు వివిధ రకాల భంగిమలు, అనేక అవతరాల్లో మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నాయి. శివాజీ, శ్రీకృష్ణుడిగా, తిరుపతి వేంకటేశ్వరుడిగా, స్పైడర్‌మెన్‌గా, మూషికవాహనుడు, ఇలా రకరకాల రూపాల్లో ఆకరణగా నిలిచాయి.

పూజారులకు డిమాండ్



మండపాల వద్ద లంబోదరుడికి పూజలు చేసేందుకు పూజారులు తప్పని సరి కావడంతో వారికి డిమాండ్ పెరిగింది. ఒక్కో పూజారి గరిష్ఠంగా నాలుగు నుంచి ఐదు వరకు మండపాలు పూజ చేసేందుకు బుక్ చేసుకున్నారు. ఐదు రోజులకు రూ.15వేలనుంచి 20 వేలు, 9-11 రోజులకు 20-25 వేల వరకు తీసుకుంటున్నారు.

విద్యుత్ కాంతుల్లో ధగధగలు

జిల్లాలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒక రోజు ముందుగానే విద్యుత్ కాంతులు విరజిమ్మేలా నిర్వహకులు సిద్ధం చేశారు.





పెరిగిన పూలు, పండ్ల ధరలు

వినాయక చవితి సందర్భంగా పూలు, పండ్ల ధరలు అమాంతం పెరిగాయి. కిలో చామంతి రూ. 250, బంతి రూ. 60-70, కిలో గులాబీకి రూ.200, లిల్లీ పూలు రూ.300-350 వరకు అమ్ముడు పోయాయి. చిన్న సైజు పూల దండ 100- 150 వరకు విక్రయిస్తున్నారు. పెద్ద సైజు రూ.300-500 వరకు అమ్ముతున్నారు. అరటి పండ్లు డజన్‌కు 120-140 వరకు విక్రయిస్తున్నారు.



వికారాబాద్‌లో మండపాలకు తరలుతున్న గణనాథులు



మేడ్చల్ పట్టణంలో..



చేవెళ్లలో అందంగా ముస్తాబు చేసిన మండపం



షాద్‌నగర్‌లో..

ప్రతీ రైతుకు న్యాయం చేస్తాం

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



పీరంపల్లి పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కులకచర్ల, సెప్టెంబరు 6: ప్రభుత్వ భూముల విషయంలో ప్రతీ ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పీరంపల్లి గ్రామంలో అధిక విస్తీర్ణంలో భూములు నమోదైన సర్వే నంబరు 709, 06లో భూములు, చౌడాపూర్ మండలంలోని లింగంపల్లి పరిధిలోని భూములను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఉన్న రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ముందుగా పీరంపల్లి పాఠశాల ఆవరణలో ఆయన మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన అధిక విస్తీర్ణంలో భూములు నమోదైన రైతులతో ఆయన మాట్లాడారు. త్వరలోనే సర్వే చేయించి రైతులకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం లింగంపల్లి చెరువు తూమును పరిశీలించారు. ప్రతీ రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండగలను సామరస్యంగా జరుపుకోవాలి

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, సెప్టెంబర్ 6 : పండుగలను భక్తి శ్రద్ధలతో సామర్యంగా జరుపుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ భవనంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గణేశ్ మండలపాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుందని, అందులో భాగంగా మండపాల నిర్వాహకులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వాటికి జియో ట్యాగింగ్ ఉంటుందని, డీజే అనుమతులు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వడం జరగదని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేశ్ మాట్లాడుతూ.శోభయాత్రకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ రాఘవీణా, నాయకులు మాధవరెడ్డి, తస్వర్ అలీ, చిగుళ్లపల్లి రమేశ్, జాఫర్, శ్రీనివాస్ గౌడ్, శివరాజ్, కేపీ రాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాశనకుంట.. కాలుష్య కాసారం

గతంలో సాగు, తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతూ కళకళలాడిన కాశనకుంట చెరువు నేడు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చుట్టూ పరిశ్రమలు విస్తరించడంతో అవి వదులుతున్న వ్యర్థాలు నేరుగా వచ్చి చెరువులో చేరుతున్నాయి. దీంతో నీరంతా రంగు మారి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఈ మురుగు నీటితో భూగర్భ జలాలు సైతం కలుషితమయ్యాయి. ఈ నీటిని వినియోగించిన వారు వ్యాధుల పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. కొత్తూర్ మండల కేంద్రానికి ఆనుకొని ఉన్న ఈ చెరువు కాలుష్యంతో నిండి ఉనికి కోల్పోతోంది.

- ఇష్టారీతిన వదులుతున్న పరిశ్రమల యాజమాన్యాలు
- రంగుగా మారి పనికి రాకుండా పోయిన చెరువు నీళ్లు
- మృత్యువాత పడుతున్న చేపలు.. ఆందోళనలో మత్స్యకారులు
- కలుషితమైన భూగర్భజలాలు.. స్థానికుల ఆగ్రహం
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

చెరువులోకి చేరుతున్న ప్రమాదకర వ్యర్థాలు



నీరు కలుషితం కావడంతో మృతిచెందిన చేపలు, చెరువులోకి చేరుతున్న పరిశ్రమల వ్యర్థాలు

కబ్జాల పర్వం 8

కొత్తూర్, సెప్టెంబరు 6: కొత్తూర్ మండల కేంద్రానికి ఆనుకుని దాదాపు 60 ఎకరాల్లో కాశనకుంట చెరువు విస్తరించి ఉంది. గతంలో కొత్తూర్ ప్రాంతానికి సాగు, తాగునీరు కోసం ఈ చెరువును వినియోగించేవారు. ఆ పరిసరాల్లో భూగర్భ జలాలు పెంచేందుకు సైతం ఈ చెరువు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. చెరువు చుట్టూ ఉన్న రైతులు వివిధ పంటలు వేసుకుంటూ జీవనం కొనసాగించారు. కానీ ఇక్కడ ఏర్పాటు చేసిన పరిశ్రమల ద్వారా నేడు చెరువు ఉనికికే ప్రమాదం ఏర్పడింది. 1976లో కొత్తూర్‌లో అప్పటి ప్రభుత్వం పారిశ్రామికవాడను ఏర్పాటు చేసింది. దీంతో ఈ చెరువు చుట్టూ విరివిగా పరిశ్రమలను ఏర్పాటు చేశారు. అత్యంత ప్రమాదకరమైన కాలుష్యకారక పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటు చేశారు. ఆయా పరిశ్రమల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, తమ పరిశ్రమల్లో ఈటీపీ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోకుండా కాలువల ద్వారా కాశనకుంట చెరువులోకి ప్రమాదకర వ్యర్థాలను వదులుతున్నారు. దాంతో చెరువు నీరు పచ్చగా మారి పూర్తిగా కలుషితమైపోయింది. చెరువు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు సైతం కలుషిమయ్యాయి. దీంతో చెరువు ఏ ఇతర అవసరాలకు పనికిరాకుండా పోయింది.

చేపల మృత్యువాత

కాశనకుంట చెరువు కలుషితం కావడంతో అందులో మత్స్య సంపదకు ఇబ్బందిగా మారింది. అందులో వేసిన చేప పిల్లలు కనీస ఎదుగుదల లేకుండా పోయింది. దీంతో స్థానిక మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ ప్రమాదకర వ్యర్థాలతో పెద్ద సంఖ్యలో చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీని వల్ల తీవ్రమైన నష్టాలకు గురవుతున్నారు.

అనారోగ్యం బారిన ప్రజలు

నీరు కలుషితం కావడంతో, ఆ నీటిని వినియోగించిన స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. చర్మవ్యాధులు, వెంట్రుకలు ఊడిపోవడం, శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులకు గురవుతున్నారు. కలుషిత నీటిని తాగిన పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయి. పంటలు సైతం కనీస దిగుబడిన ఇవ్వని దుస్థితి.

చెరువును పరిరక్షించాలి



కాలుష్య కోరల్లో చిక్కుకుపోయిన కాశనకుంట చెరువును పరిరక్షించాలి. చెరువు పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు కలుషితం కావడంతో పంటలు పండడం లేదు. దీంతో దిగుబడి సైతం రావడం లేదు. పరిశ్రమల యాజమానులు ఇష్టారాజ్యంగా కలుషిత నీటిని చెరువులోకి వదులుతున్నారు. అధికారులు వెంటనే స్పందించాలి.

-బి. గోవింద్‌రెడ్డి, రైతు, కొత్తూర్

తీవ్రంగా నష్టపోతున్నాం



చెరువు నీరు కలుషితం కావడంతో చేపలు పెరగకుండా గిడసు పారిపోతున్నాయి. కనీస దిగుబడి రావడం లేదు. దాంతో తీవ్ర నష్టాలకు గురవుతున్నాం. కలుషిత నీరు ఎక్కువగా వదిలినప్పుడు చేపలు మృత్యువువాత పడుతున్నాయి. పరిశ్రమల వ్యర్థాలు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.


- ఇప్పల గిరి ముదిరాజ్, మత్స్యకార సొసైటీ కార్యదర్శి, కొత్తూర్

బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి


సమావేశంలో ఐక్యత చాటుతున్న బీసీ సంఘం నాయకులు

షాబాద్, సెప్టెంబరు 6 : జనాభా ప్రాతిపదికన బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ ఐక్య వేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం షాబాద్‌లో ముదిరాజ్ భవన్‌లో బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో బీసీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు లింగం, బీజేపీ మండలాధ్యక్షుడు కిరణ్ తదితర నాయకులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేలా ఒత్తిడి తీసుకురావాలని తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి స్థానిక సంస్థల్లో ఉన్న 23శాతం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలన్నారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు స్థానిక సంస్థల్లో అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తమ్మలి రవీందర్, కుమ్మరి చెన్నయ్య, మంగలి చెన్నయ్య, మద్దూరి మల్లేష్, చందిప్ప జంగయ్య, కమ్మరి శ్రీను, రవి, గౌరీశ్వర్, హరి పాల్గొన్నారు.







విప్లవాత్మక వ్యవసాయ విద్యా వ్యవస్థను రూపొందించాలి

- యువత కొత్త ఆలోచనలకు పదును పెట్టాలి
- రైతును మించిన శాస్త్రవేత్తలు లేరు
- ఐకార్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ హిమాన్షు పాఠక్
- కన్హా శాంతివనంలో వ్యవసాయ విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ల జాతీయ సదస్సు


ఆధునిక వ్యవసాయ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఐకార్ ప్రతినిధులు హిమాన్షు పాఠక్, ఆర్‌సి అగర్వాల్, గురూజీ కమలేష్ పటేల్

నందిగామ, సెప్టెంబరు 6 : విప్లవాత్మక వ్యవసాయ విద్యా వ్యవస్థను రూపొందించాలని, దానికి అనుగుణంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు, అధ్యాపకులు శ్రీకారం చుట్టాలని ఐకార్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ హిమాన్షు పాఠక్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్టు, శ్రీకొండలక్ష్మి తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ సహకారంతో వ్యవసాయ విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్ల జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐకార్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ హిమాన్షు పాఠక్, డైరెక్టర్ ఆర్‌సి అగర్వాల్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐకార్ ప్రతినిధులు మాట్లాడుతూ స్వయం సమృద్ధి గల భారతదేశ నిర్మాణం కొరకు యువ వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆధునిక వ్యవసాయంపై పరిశోధనలు చేస్తూ కొత్త ఆలోచనలకు పదును పెట్టేవిధంగా విశ్వవిద్యాలయాలు రూట్‌మ్యాప్ రూపొందించాలని అభిప్రాయపడ్డారు. రైతును మించిన శాస్త్రవేత్తలు మరొకరు లేరని, సమాజానికి రైతులే అన్నదాతలన్నారు. తాజా గణాంకాల ప్రకారం యువత 2శాతం వృత్తి శిక్షణలో, 93 శాతం అసంఘటిత రంగాల్లో ఉన్నారన్నారు. వ్యవసాయం, ప్రకృతి, పురోగతి, శాంతి ఒకదానికొకటి ముడిపడి ఉన్నాయని, వ్యవసాయం ఎప్పుడూ విడదీయబడలేదన్నారు. దేశంలో 45 శాతం కంటే ఎక్కువ మంది వ్యవసాయంమీద ఆధారపడి ఉన్నారని, స్వాతంత్య్రం వచ్చినప్పుడు 80 శాతం మంది ప్రజలు వ్యవసాయమే జీవనోపాధిగా జీవనం సాగించారని అన్నారు. ఇప్పటికీ భారత్‌లో వ్యవసాయమే అత్యంత ముఖ్యమైన రంగమని, పురోగతి, సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయడంలో విద్యార్థులకు కొత్త ఆలోచనలు రేకెత్తించేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వాతవరణ మార్పు, నీటి కాలుష్యం, తక్కువ భూమిలో ఎక్కువ పంటను పండించడానికి తక్కువ వనరుల నుంచి ఎలా వ్యవసాయం చేయాలనే విషయమై విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలన్నారు. భవిష్యత్తులో ఆహార పంటలకు సంబంధించి ప్రపంచానికి భారతదేశం కేంద్ర బిందువుగా మారనుందని, ప్రస్తుతం దేశంలో చాలామంది విద్యావంతులు వ్యవసాయరంగం వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. అంతిమంగా సాంప్రదాయ వ్యవసాయం చేసే రైతు వ్యవసాయ పరిశ్రమగా ఆధునీకరించి రేపటి తరానికి దాని ఆవశ్యకతను తెలియజేయడం గొప్ప విషయమన్నారు. రైతులు సమీకృత వ్యవసాయం, వైవిధ్యభరితమైన పంటలు, చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అధిక దిగుబడి కోసం మెరుగైన వ్యవసాయ సాధనాలు, మౌలిక సదుపాయాలు అందించాలన్నారు. రైతులకు ప్రభుత్వాలు సరైన ప్రోత్సాహం అందిస్తే మెరుగైన ఉపాధి, పేదరికాన్ని నిర్మూలించి దేశాన్ని వృద్ధిలోకి నడిపించే అవకాశముందన్నారు. వ్యవసాయాన్ని వాణిజ్యపరంగా, లాభదాయకంగా మార్చడంపై దృష్టి సారించాలన్నారు. గురూజీ కమలేష్ డి పటేల్ మాట్లాడుతూ రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్టు సహకారంతో ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న గొప్ప కార్యక్రమాలు, తాము నిర్వహిస్తున్న విద్య, వైద్య, ఆరోగ్య, ఆధునిక వ్యవసాయం తదితర కార్యక్రమాలకు ప్రభుత్వం సహకారం అందించడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా నిపుణులు తయారుచేసిన ఆధునిక సాంకేతిక వ్యవసాయ యంత్రాలను ఐకార్ ప్రతినిధులు, వైస్ చాన్సలర్లు పరిశీలించారు. సమావేశంలో సమ్మిట్ కన్వీనర్ నివేదిత శ్రేయాన్స్ విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లు, అధ్యాపకులు రామచంద్రమిషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అటెండర్ల స్థానంలో ఇతరులు పనిచేస్తే చర్యలు


ధారూరు పశువైద్యశాలలో రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న డాక్టర్ పూర్ణచందర్ రావు

ధారూరు, సెప్టెంబరు 6: జిల్లాలోని పశువైద్యశాలల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న మహిళా అటెండర్ల స్థానంలో వారి సంబంధీకులు పనిచేస్తున్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ పూర్ణ చందర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలను శుక్రవారం ఆయన సందర్శించి రిజిస్టర్లను, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 38మంది ఔట్‌సోర్సింగ్ అటెండర్లు పశువైద్యశాలల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా ఇతరులతో విధులు చేయించినట్లు నిర్ధారణ అయితే ఉపేక్షించేదిలేదని, ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. మండలంలోని నాగారం పశువైద్యశాలలో మహిళా అటెండర్ స్థానంలో మరొకరు విధులు నిర్వహిస్తున్నారనే విషయమై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ధారూరు పశువైద్యాధికారిని ఆదేశించామని తెలిపారు. పశువులు, మేకలు, గొర్రెలకు వాక్సినేషన్‌పై ప్రత్యేక నిఘాపెట్టామని చెప్పారు. పశువైద్యానికి ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. రైలు పట్టాలపై రెండు రైళ్లు ఢీకొని 66మేకలు మృత్యువాతపడిన ఘటనపై విచారణ జరిపి నివేదికను సీఎంకు పంపించామన్నారు. బాధితులకు పరిహారం అందేలా చూస్తామని అన్నారు.

కేసీ వేణుగోపాల్‌ను కలిసిన సంతోష్‌కుమార్


ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌తో కోల్కొంద సంతోష్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జార్కండ్ వార్ రూం చైర్మన్‌గా నియమితులైన యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కోల్కొంద సంతోష్‌కుమార్ శుక్రవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సంతోష్‌కుమార్‌ను పార్టీ అధిష్ఠానం జార్కండ్ వార్ రూం చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏఐసీసీ ముఖ్య నేతలను కలిసేందుకు ఢిల్లీ వెళ్లిన సంతోష్ కుమార్ పార్టీ కేంద్ర కార్యాలయంలో కేసీ వేణుగోపాల్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. మరికొందరు ముఖ్య నేతలను కలవనున్నట్లు తెలిసింది. ముఖ్యనేతలను కలిసి ధన్యవాదాలు చెప్పి తనపై ఎంతో నమ్మకం ఉంచి ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు.

అలుగు పారుతున్న ఎదిర చెరువు


ఎదిరలో అలుగు పారుతున్న చెరువు వద్ద గ్రామస్తులు

చౌదరిగూడ, సెప్టెంబరు 6: కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుంటోంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిర చెరువు అలుగు పారుతుండంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెరువు నిండడంతో మాజీ సర్పంచ్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు చెరువు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యప్రమోద్, యాదయ్య, సురేందర్, రామస్వామి, నర్సింహులుతో పాటు యువకులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు తెగిన 11 కేవీ వైర్

- ఎల్టీ వైర్‌పై పడటంతో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు 15 బోరు మోటార్లు, స్టార్టర్లు కాలిపోయిన వైనం
- రూ.2.70లక్షల మేర ఆస్తి నష్టం


నజ్దీక్‌సింగారంలో కాలిపోయిన స్టార్టర్

యాచారం, సెప్టెంబరు 6 : ఈదురు గాలులకు 11 కేవీ వైరు తెగి ఎల్టీ వైర్‌పై పడడంతో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు 15 వ్యవసాయ బోర్ మోటార్లు, స్టార్టర్లు కాలిపోయిన ఘటన గురువారం సాయంత్రం మండలంలోని నజ్దీక్‌సింగారంలో చోటుచేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు.. గురువారం సాయంత్రం ఒక్కసారిగా భారీ ఈదురు గాలులు వీచాయి. దాంతో గ్రామ సమీపంలో 11 కే వీ వైర్ తెగిపోయి దాని కింద ఉన్న ఎల్టీ వైర్‌పై పడిపోయింది. ఓ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా.. రైతులు రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జంగారెడ్డి, ముత్యాలు, జంగయ్య, యాదిరెడ్డి, శంకర్, చెన్నారెడ్డి, శ్రీశైలం, గాల్లయ్య, రాములు తదితరులకు చెందిన 15 వ్యవసాయ బోర్ మోటార్లు కాలిపోవడంతో పాటు స్టార్టర్లు కాలిబూడిదయ్యాయి. వాటి మరమ్మతులకు ఒక్కో రైతుకు రూ.18వేల వరకు వ్యయమవుతుందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే వరి సాగుకు అ ప్పులు చేశామని రైతులు వాపోయారు.




పొంగి ప్రవహిస్తున్న లక్నాపూర్ ప్రాజెక్టు

లక్నాపూర్ ప్రాజెక్టుకు భారీ వరద


కాళ్ళాపూర్‌లో వర్షానికి కూలిన ఇల్లు

పరిగి, సెప్టెంబరు 6: పరిగి మండలం లక్నాపూర్ ప్రాజెక్టులో భారీగా వరద నీరు వచ్చి చేరింది. పరిగి డివిజన్‌లో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా కురిసిన వర్షంతో కుంటలు, చెరువులు నిండాయి. నాలుగు రోజుల విరామం తర్వాత తిరిగి భారీ వర్షం కురవడంతో లక్నాపూర్ ప్రాజెక్టు భారీ నీటితో ప్రవహిస్తోంది. భారీ వర్షానికి రోడ్లన్నీ దెబ్బతిని బురదమయంగా మారాయి. పరిగి పట్టణంలోని పలు కాలనీల్లో నీరుతో జలమయమయ్యాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పరిగి-సయ్యద్‌మల్కాపూర్‌ల మధ్య రోడ్డు గుంతలమయంగా మారి వాహనాలకు ఇబ్బంది కలుగుతోందని వాపోతున్నారు. పంట పొలాల్లో నీరు నిలిచి నష్టం వాటిల్లుతోందని రైతులు తెలిపారు. వర్షాలకు పురాతన ఇళ్లు కూలిపోతున్నాయి. పరిగి మండలం కాళ్ళాపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ళ విమలమ్మ ఇల్లు కూలిపోయియింది.

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ

వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి


పెద్దేముల్ శివారులో వరిపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయధికారి మోహన్‌రెడ్డి

పెద్దేముల్, సెప్టెంబరు 6: అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అవుతుందని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో జరుగుతున్న రేషన్‌కార్డు, కుటుంబసర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతీరైతుకు తప్పకుండా రుణమాఫీ అవుతుందన్నారు. రేషన్ కార్డు లేని వారికి రుణమాఫీ నిలిచిపోయినా వ్యవసాయాధికారులు కుటుంబాన్ని ఒక గ్రూపుగా ఏర్పాటుచేసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారన్నారు. అక్కడి నుంచి పలు గ్రామాల్లోని పంటపొలాలను పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్నపంటలు, తెగుళ్లసోకిన పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు తగుసూచనలు చేశారు. ఆయనవెంట తాండూరు ఏడీఏ రుద్రమూర్తి, ఏఈవోలు వినయ్, రజిత, శివరాజ్ పాల్గొన్నారు.

కందుకూరును మున్సిపాలిటీ చేయాలి


స్థానిక నేతలతో మాట్లాడుతున్న కేఎల్లార్

కందుకూరు, సెప్టెంబరు 6: కందుకూరును మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు కప్పాటి పాండురంగారెడ్డి, సత్యనారాయణ, ఎగ్గిడి కృష్ణ, కె.మధన్‌పాల్‌రెడ్డిలు ఆ పార్టీ నాయకులతో తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈమేరకు ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం కందుకూరును మున్సిపాలిటీగా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. నగరానికి అతిసమీపంలో ఉన్న కందుకూరును మున్సిపాలిటీగా చేయడానికి అన్ని వసతులు ఉన్నట్లు స్థానిక నేతలు లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. కందుకూరు, కొత్తగూడ, కొత్తూరు, గూడూరు, అన్నోజిగూడ, దెబ్బడగూడ, కటికపల్లి, గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా చేయాలని విజ్ఞప్తి చేశారు. కేఎల్లార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జనాభా గణనీయంగా పెరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ప్రాంతంలో ఫార్మా, ఫోర్త్‌సిటీతో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

రైల్వే సమాచారానికి వన్‌స్టాప్ కాంటాక్ట్ 139

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 6: రైల్వేలకు సంబంధించి అన్నిరకాల హెల్ప్‌లైన్‌లను ఏకీకృతం చేస్తూ 139 నంబరును వన్‌స్టాప్ కాంటాక్ట్‌గా ఏర్పాటు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. ఇకపై ప్రయాణికులు ఏదైనా సమాచారం, సహాయం కావాల్సి వస్తే నేరుగా 139 నంబరుకు ఫోన్ చేయవచ్చు. 139 హెల్ప్‌లైన్ ప్రస్తుతం 12భాషల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. రైళ్లకు సంబంధించిన ఏదేని సమాచారం/ఫిర్యాదు కోసం 139 నంబరుకు ఫోన్ చేసి ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్(ఐవీఆర్ఎస్) లేదా నేరుగా కాల్‌సెంటర్ ఉద్యోగితో నేరుగా సంప్రదించవచ్చు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలనుకునే రైల్‌మదద్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులు పంపవచ్చు. ప్రయాణంలో భద్రతకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 139కు ఫోన్‌చేయవచ్చు. పీఎన్ఆర్ స్టేటస్ కోసం 1, రైలు షెడ్యూలు కోసం 2, సాధారణ ఫిర్యాదుల కోసం 3, టికెట్టు రద్దు, సొమ్మువాపసు వివరాల కోసం 4, దివ్యాంగులకు సంబంధించిన సమాచారం కోసం 5, విజిలెన్స్ సంబంధిత ఫిర్యాదుల కోసం 6 నొక్కాలి. రైల్వేల పనితీరుకు సంబంధించి నాణ్యతలేని సమాచారాన్ని సోషల్‌మీడియాలో రీల్స్, వీడియోలను ప్రసారం చేయడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని అధికారులు వెల్లడించారు.

వైద్యుల చొరవ.. చిన్నారికి తప్పిన ప్రాణాపాయం

ఆమనగల్లు, సెప్టెంబరు 6 : మండల కేంద్రానికి చెందిన వైద్యులు ఓ చిన్నారిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు డాక్టర్లు పరీక్షిత్, నరేందర్, నాగరాజులు విధులు ముగించుకొని శుక్రవారం సాయంత్రం ఇంటికి బయల్దేరారు. ఈక్రమంలో ఆమనగల్లు సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద మహబూబ్ నగర్ జిల్లా అచ్చంపేట మండలం గుంపెన్‌పల్లి నుంచి ఆటోలో రాజేశ్వరి-భరత్ దంపతులు హైదరాబాద్ వెళుతున్నారు. ఇంతలో వారి 15 నెలల చిన్నారి అక్షిత ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండగా.. తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురై రోదించడం గమనించారు. ఆ ముగ్గురు వైద్యులు వెంటనే వారు వెళుతున్న వాహనం ఆపి చిన్నారిని పరీక్షించి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి

తలకొండపల్లి, సెప్టెంబరు 6: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. వర్షా కాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మండలంలోని రాంపూర్‌లో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కామినేని ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నిర్మశ్రీశైలం గౌడ్, ఉప్పల అఖిల్, ఉప్పల వెంకటేశ్, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసా కోసం హత్య

- ఆగస్టు 30న పెద్దేముల్ మండలంలో ఘటన
- ఘటనా స్థలంలో దొరికిన పర్స్ ఆధారంగా కేసు ఛేదన
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్, సెప్టెంబర్ 6 : జల్సాలకు అలవాటు పడిన ఇద్దరు స్నేహితులు కేవలం మద్యం సీసాల కోసం ఓ యువకుడిని హత్య చేశారు. బెల్టుతో గొంతు నులిమి చంపేశారు. అనంతరం మృతదేహాన్ని సుద్దగుంతలో పడేశారు. ఘటనా స్థలంలో దొరికన పర్స్ ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తించారు. శుక్రవారం కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హత్యకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బండమీదిపల్లి రమేశ్(32) ఆగస్టు 31న గోపాల్‌పూర్ శివారులోని ఓ సుద్ధగుంతలో పడి మృతి చెందాడు. అతడి తల్లి నాగమ్మ తన కుమారుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహించారు. సంఘటన స్థలంలో ఓ పర్సు దొరికింది. ఈ పర్సులో బంటారం మండలం సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు సంబంధించిన ఆధార్ కార్డు, ఓటర్ ఐడీలు లభ్యమయ్యాయి. శ్రీకాంత్‌ను పోలీసులు తమదైన శైలిలో విచారించగా, పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన బండమీదిపల్లి నరేశ్‌తో కలిసి రమేశ్‌ను హత్య చేసినట్లు అంగీకరించాడు.

పంపకంలో తేడా రావడంతో హత్య

శ్రీకాంత్, నరేశ్ ఇద్దరూ కలిసి ఆగస్టు 30న తాండూరుకు బైక్‌పై వచ్చారు. బైక్‌పై అటు ఇటు తిరుగుతూ ఉన్న క్రమంలో రుద్రారం గ్రామానికి చెందిన రమేశ్ కనిపించాడు. ముగ్గురూ కలిసి పెద్దేముల్‌కు వచ్చి మద్యం సేవించారు. మద్యానికి డబ్బులు లేకపోవడంతో పెద్దేముల్ మండల కేంద్రంలో ఉన్న కల్లు దుకాణంలో 13 సీసాల క్వార్టర్లు దొంగతనం చేశారు. దొంగతనం చేసిన తర్వాత మద్యం సీసాల పంపకం విషయంలో రమేశ్, శ్రీకాంత్, నరేశ్‌లు గొడవపడ్డారు. రమేశ్ తనకు ఎక్కువ మద్యం సీసాలు కావాలని గొడవ పడ్డారు. దీంతో రమేశ్‌ను చంపాలని కుట్ర చేశారు. రుద్రారం గ్రామానికి వెళ్లే క్రమంలో రమేశ్‌ను కిందపడేసి మీద కూర్చున్నారు. ఆ సమయంలో నరేశ్ తన వద్ద ఉన్న బెల్టుతో రమేశ్ గొంతుకు వేసి అటు శ్రీకాంత్, ఇటు నరేశ్ బలంగా లాగారు. దీంతో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని గోపాల్‌పూర్ శివారులోని సుద్ద గుంతలో పడేశారు. తర్వాత రుద్రారంలో రాత్రి పడుకుని ఉదయం సల్‌బత్తాపూర్ వెళ్లారు. ఘటన స్థలంలో శ్రీకాంత్ పర్సు ఆధారంగా కేసును ఛేదించి నిందితులు శ్రీకాంత్, నరేశ్‌లను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు రూరల్ సీఐ అశోక్, ఎస్ఐ గిరి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

కారు అద్దాలు ధ్వంసం చేసిన కేసులోనూ..

అయితే రుద్రారం గ్రామానిక చెందిన నరేశ్ హైదరాబాద్ శివారులోని పటన్‌చెరులో ఉంటున్నాడు. తనకు ఏదైనా పని కల్పించాలని సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌ను కోరాడు. పని దొరకడంతో నరేశ్, శ్రీకాంత్ ఇద్దరూ ఆగస్టు 29వ తేదీన సల్బత్తాపూర్ గ్రామానికి వచ్చి అక్కడ ఓ కారు అద్దాలు పగలగొట్టి అందులో కెమెరాలు దొంగతనం చేశారు. ప్రస్తుతం ఈ కేసు బంటారం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

రుణమాఫీ కాలేదు.. న్యాయం చేయండి

- బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని రైతు ఆవేదన
- అధికారుల తప్పిదం అంటున్న బ్యాంకర్లు


రుణమాఫీ వివరాలు తెలుసుకుంటున్న రైతు వెంకటయ్య

తాండూరు రూరల్, సెప్టెంబరు 6: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీకి అన్ని అర్హతలున్నా రుణమాఫీ కాలేదని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. బ్యాంకులు, వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయాడు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తంచేశాడు. వివరాలిలా ఉన్నాయి. తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని మల్‌రెడ్డిపల్లికి చెందిన రైతు దస్తగిరి వెంకటయ్యకు సంబంధించి తాండూరు మండలం అంతారం పరిధిలోని సర్వేనెంబర్-297, 298లో దాదాపు ఐదెకరాల పొలం ఉంది. ఈ భూమి పాస్‌పుస్తకాలు పెట్టి తాండూరులోని యూనియన్ బ్యాంకులో రూ.లక్షా 60వేల రుణం తీసుకున్నాడు. తీసుకున్న రుణంతో పాటు మిత్తి చెల్లించి మరోసారి రూ.లక్షా 30వేలు రుణం పొందాడు. అదేవిధంగా చెన్‌గేష్‌పూర్‌లోని సర్వేనెంబర్-109 ఎకరా పొలానికి సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.42వేలు రుణం తీసుకున్నాడు. మొత్తం రూ.2లక్షలపైనే రుణం ఉంది. అయినప్పటికీ రైతు వెంకటయ్యకు రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదని రైతు వెంకటయ్య వ్యవసాయ కార్యాలయానికి వెళ్లాడు. అయితే తనకు సంబంధించిన రెండు ఖాతాల్లో అప్పు ఉండగా, మరో ఖాతా నారాయణపేట్ జిల్లా ఆత్మకూర్ మండలానికి చెందిన చిన్న అంజన్నకు సంబంధించిన వివరాలు నమోదు అయ్యాయి. మూడు ఖాతాలు కలిపి రూ.3లక్షల 95వేలు వస్తోంది. దీంతో రైతు వెంకటయ్యకు రుణమాఫీ కావడం లేదు. బ్యాంక్‌కు వెళ్లి అడిగితే మక్తల్ బ్యాంక్‌కు వెళ్లమని చెప్పడంతో అక్కడికి కూడా వెళ్లాడు. గత 15రోజుల నుంచి జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంతోపాటు కలెక్టర్, తాండూరు ఏడీఏతోపాటు తాండూరు బ్యాంకు, మక్తల్ బ్యాంకు తిరుగుతున్నాడు. వ్యవసాయ శాఖ అధికారుల తప్పిదం వల్లే ఇలా జరిగిందని బ్యాంకర్లు చెబుతున్నారని బాధిత రైతు తెలిపాడు. శుక్రవారం అంతారం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి, ఏఈవో శివకుమార్‌ను కలిసి విన్నవించుకున్నాడు. అయితే వారు బ్యాంకుకు వెళ్లాలని చెబుతున్నారని వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

తాండూరు, కొడంగల్‌కు కొత్త బాస్

- సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరణ
- సమస్యల సత్వర పరిష్కారానికి ఆస్కారం


తాండూరు సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉమా శంకర్‌ప్రసాద్

తాండూరు, సెప్టెంబరు 6: రాష్ట్ర సరిహద్దులో నున్న తాండూరు సబ్ డివిజన్‌తో పాటు కొడంగల్ నియోజకవర్గానికి కొత్త బాస్ వచ్చారు. తాండూరు సబ్‌కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఆర్డీవో శ్రీనివాస్‌రావు నుంచి సబ్ కలెక్టర్ చార్జి తీసుకున్నారు. శ్రీనివాస్‌రావుకు ఇంకా పోస్టు ఎక్కడ ఇవ్వలేనందున కలెక్టర్‌కు రిపోర్టు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 ఆర్డీవో కార్యాలయాలను పరిపాలనా సౌలభ్యం రీత్యా తాండూరు ఆర్డీవో కార్యాలయాన్ని సబ్‌కలెక్టర్ హోదాగా మార్చారు. గతంలోనూ సబ్‌కలెక్టర్ హోదా ఉన్న ఈ కార్యాలయాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పట్లో ఎత్తేసి ఆర్డీవో కార్యాలయంగా మార్చింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలల్లోనే హోదా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తాండూరు సబ్‌డివిజన్‌కు ఉమాశంకర్ ప్రసాద్ రెండవ ఐఏఎస్ అధికారిగా కొనసాగుతారు. గతంలో ఐఏఎస్ అధికారి సందీప్‌కుమార్ ఝూ సబ్ కలెక్టర్‌గా పనిచేశారు. ఈ డివిజన్ కేంద్రం సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్ దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాలు వస్తాయి. తాండూరు నియోజకవర్గంలో తాండూరు మున్సిపాలిటీ, తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్, కోట్‌పల్లి మండలాలు వస్తాయి. శుక్రవారం ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్, సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారులతో సమీక్షించారు. తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలలో భూ సమస్యలు త్వరగా పరిష్కరరమయ్యే అవకాశాలుంటాయి. కలెక్టర్ వెళ్లకుండా సబ్‌కలెక్టర్ స్థాయిలో కొన్ని సమస్యలు పరిష్కరమవుతాయి. అభివృద్ధి పనులు వేగవంతం అయ్యే అవకాశాలున్నాయి.

ప్రజా సమస్యలు పరిష్కారిస్తా

తాండూరు ప్రాంతంలో నెలకొన్న ప్రజాసమస్యల పరిష్కరిస్తా. ఈ ప్రాంతంపై పట్టు పెంచుకొని సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తా. - సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్


యాచారంలో సైనికులకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు, మహిళలు

‘సైకిల్ యాత్ర’ సైనికులకు ఘన స్వాగతం

యాచారం, సెప్టెంబరు 6 : దేశ సమగ్రతకు యువత పాటు పడాలని, మనమంతా భరతమాత బిడ్డలుగా ఆమె సంరక్షణకు పాటుపడాలని మిలటరీ రావత్ మేజర్ అభిజిత్‌సింగ్, గోవింద్‌రావులు తెలిపారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేస్తున్న భారత మిలటరీకి చెందిన 20 మంది సైనికుల యాత్ర శుక్రవారం యాచారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా యాచారం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేశం, ధర్మం, జన్మనిచ్చిన అమ్మనాన్నలు, సమాజహితం గురించి యోచించాలన్నారు. అంతకుముందు వారికి బీజేపీ రాష్ట్ర నాయకులు కొప్పు బాషా, మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, జి.రమేష్, బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఖాజుద్దీన్, ఎస్సై మధు, యాచారం ఉన్నత పాఠశాల, పుడమి, జోవియల్ పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాలతో ఘన స్వాగతం పలికారు.

అంజలి లేఖపై జోరుగా చర్చ

ఆదిభట్ల, సెప్టెంబరు 6 : ప్రభుత్వ పాఠశాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఈ విషయంపై ఆదిభట్లలో చర్చ జరుగుతోంది. దీనికి కారణం ఆదిభట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివే విద్యార్థిని అంజలి తన పుట్టినరోజు గత డిసెంబరు 20న సంక్షేమ పథకాల జాబితాలో ప్రభుత్వ పాఠశాలలను చేర్చాలని, గృహ అవసరాల కోసం ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో ప్రభుత్వ పాఠశాలలను చేర్చి ఉచిత విద్యుత్ అందించాలని సీఎంకు లేఖ రాసింది. ఇప్పుడు సీఎం విద్యా సంస్థలక ఉచిత విద్యుత్ ఇవ్వడంతో స్థానికంగా అంజలి లేఖ గురించి చర్చ జరుగుతుంది.

రైతులకు పరిహారం అందించాలి

చేవెళ్ల, సెప్టెంబరు 6: పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో శక్రవారం భారీ ర్యాలీగా వెళ్లి చేవెళ్ల ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో సాయిరాంకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వర్షాల వల్ల మరణించిన కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, వివిధ మండలాల సీపీఐ కార్యదర్శులు సత్తిరెడ్డి, జంగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారీ వర్షం.. రైతన్నకు తీరని నష్టం

ధారూరు, సెప్టెంబరు 6: భారీ వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మండలంలో చేతికి వచ్చిన పెసరపంట వర్షాలకు దెబ్బతిని రైతులకు తీరని నష్టాన్ని మిగిలిచ్చింది. పొలంలో ఎండిన పెసరకాయ వర్షానికి తడిసి మొలకలు వచ్చి పనికిరాకుండా మారింది. కాగా వర్షాలకు దెబ్బతిన్న పెసర పంటను శుక్రవారం వికారాబాద్ ఏడీఏ స్వరూప పరిశీలించారు. పంట నష్ట పరిహారం అందేలా చూడాలని రైతులు కోరారు. కాగా ధారూరు క్లస్టర్ పరిధిలో ఏఈవో సంతోష్ దెబ్బతిన్న పెసర పంటను పరిశీలించి పంట వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. ఏడీఏ వెంట ఏఈవోలు సంజూ రాథోడ్, మల్లేశ్‌లు, రైతులు ఉన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించాలి

కొడంగల్: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించాలని రైతులు కోరారు. కొడంగల్ మండలంలోని అన్నారం గ్రామ రైతులు మాజీ సర్పంచ్ టి.అనితా పకీరప్ప ఆధ్వర్యంలో శుక్రవారంకొడంగల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏఈవో దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షాలకు పత్తి, మినుము పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, తమకు పరిహారం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామం మీదుగా హైటెన్షన్ వైర్లు వేయెద్దు

షాద్‌నగర్/కేశంపేట, సెప్టెంబరు 6: ప్రమాదకరమైన హైటెన్షన్ వైర్లను తమ గ్రామం మీదుగా ఏర్పాటు చేయొద్దని కేశంపేట మండలం పోమాల్‌పల్లి గ్రామస్థులు ఆర్డీవోకు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ అనుమగళ్ల రమేష్ నేతృత్వంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందించారు. అదేవిధంగా షాద్‌నగర్‌లో ఆర్డీవో వెంకట మాధవరావును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు మాట్లాడుతూ మహేశ్వరం నుంచి జడ్చర్ల వరకు వేస్తున్న 765 కేవీఏ హైటెన్షన్ విద్యుత్ లైన్ కొరకు ముందుగా చేసిన మార్కింగ్‌ను మార్చి కొత్తగా గ్రామం మీదుగా లైన్ ఏర్పాటు చేసేందుకు మార్కింగ్ చేశారని వాపోయారు. దీనివల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పూజారి ఫణీంద్ర, ముత్యాల్ రెడ్డి, కర్నకోట శ్రీనివాసులు, భూపాల్ రెడ్డి, అంజయ్య, యాదయ్య, బండ కృష్ణయ్య, మస్తాన్, ఎల్లయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పారాలింపిక్స్ కాంస్య పతకం విజేతకు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 6: పారా ఒలంపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తి జీవన్‌జీ శుక్రవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. దాంతో ఆమెకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు, కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టులో పూలమాలలు, శాలువాలతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. శివసేనారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తూ మున్ముందు మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

మీడియా, క్రీడకారులపై సీఐఎస్ఎఫ్, జీఎంఆర్ రక్ష సిబ్బంది దురుసుగా ప్రవర్తన


క్రీడాకారులతో వాగ్వాదానికి దిగిన సీఐఎస్ఎఫ్, జీఎంఆర్ సిబ్బంది

హైదరాబాద్ చేరుకున్న దీప్తి జీవన్‌జీ వార్త కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులు, స్వాగతం పలకడానికి ఎయిర్‌పోర్టుకు వచ్చిన వివిధ క్రీడకారులపై సీఐఎస్ఎఫ్, జీఎంఆర్ రక్షా సిబ్బంది దురుసుగా ప్రవర్తించడమేకాక మీడియా ప్రతినిధుల కాలర్ పట్టుకొని పక్కకు నెట్టేశారు. స్వాగతం పలకడానికి వచ్చిన కొందరు మహిళా క్రీడకారులపై కూడా దురుసుగా ప్రవర్తించారు. ఈక్రమంలో మీడియా ప్రతినిధులకు, జీఎంఆర్ రక్షా సిబ్బందికి వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా, ప్రముఖులు ఎయిర్‌పోర్టుకు వచ్చేటప్పుడు సరైన భద్రత కల్పించడంలో వారు విఫలమయ్యారని పలువురు ఆరోపించారు.

క్రమశిక్షణతో కష్టపడితే లక్ష్యసాధన సులభం


మాట్లాడుతున్న సిద్ధార్థ ప్రిన్సిపాల్ కూర జయదేవ్

వికారాబాద్, సెప్టెంబరు 6: విద్యార్థులు క్రమ శిక్షణతో కష్టపడితే లక్ష్య సాధన సులభమవుతుందని సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిష్టారెడ్డి, కూర జయదేవ్‌లు అన్నారు. పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫస్టియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పేరెంట్ గెస్ట్‌గా అలీముద్దీన్, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ సరిత హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ అంటువ్యాధి కాదు

వికారాబాద్, సెప్టెంబరు 6: ఎయిడ్స్ అంటువ్యాధి కాదని ఎస్ఏపీ కళాశాల ప్రిన్సిపాల్ మందారిక పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవెల్ రెడ్ రిబ్బన్ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, కేవలం జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎయిడ్స్ ప్రచారకర్త భవానీ, సివిల్ ఆస్పత్రి ఐసీటీసీ కౌన్సిలర్ రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జి.రామచంద్రయ్య, సంజీవరెడ్డి, మల్లేశం, సౌమ్య, మనిషా, లక్ష్మణ్, వలంటీర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

కొడంగల్, సెప్టెంబరు 6: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024-25 విద్యా సంవత్సరానికి ఫస్టియర్ డిగ్రీ డీఎస్సీ, బీకాం, బీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30వ తేదీ వరకు గడువుఉందని ప్రిన్సిపాల్ రఫియా ఖానమ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్‌ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. 2015-16నుంచి 2023-24 వరకు అడ్మిషన్ పొంది ఫీజు సకాలంలో చెల్లించని వారు ఈనెల 30తేదీలోపు చెల్లించాలని కోరారు.

విద్యార్థులు స్కిల్స్ పెంచుకోవాలి


డాక్టర్ వీఎస్‌కే.రెడ్డి.

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 6: స్కిల్స్ క్లబ్‌లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు స్కిల్స్ పెంచుకోవాలని మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ వీఎస్‌కేరెడ్డి అన్నారు. గుండ్లపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి యూనివర్సిటీలో శుక్రవారం ఫే సెప్టెంబర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థి క్లబ్, స్కిల్‌క్లబ్‌లను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ప్రాజెక్టుల నిర్వాహణతో విద్యార్థుల పరిజ్ఞానం ఎంతగానో పెరుగుతుందన్నారు. విద్యార్థులు క్లబ్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అంజనేయులు, డీన్, ఎఫ్ఎస్‌వోఈకే హరికృష్ణ, ఇన్ఫర్మేషన్ హెచ్‌వోడీ డాక్టర్ బీ.రాజ శరత్‌కుమార్, కంప్యూటర్ సైన్స్‌విభాగం డీన్ డాక్టర్ మీరవలి, డేటాసైన్స్ డీన్ నవీన్‌కుమార్, సైబర్ సెక్యూరిటీ అండ్ ఐవోటీ హెచ్‌ఓడీ జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సివిల్ సప్లయి డీఎంను కలిసిన పీఏసీఎస్ చైర్మన్

దోమ, సెప్టెంబరు 6: వికారాబాద్ జిల్లా సివిల్ సప్లయి డీఎంగా విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించడంతో దోమ పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకరరెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ సప్లయిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలకు తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మట్టి గణపతులను పూజిద్దాం



పరిగి: మట్టి వినాయకులను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



వికారాబాద్: మట్టివినాయకులను పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ మంజులరమేష్



కొడంగల్: మట్టివినాయక ప్రతిమలను అందజేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్



తాండూరు రూరల్: మట్టి వినాయకులు తయారు చేసిన చెంగోల్ పాఠశాల విద్యార్థులు

పరిగి, సెప్టెంబరు 6: మట్టి గణపతులనే పూజించాలని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలోని దాసాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టి.ఉమారామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ; నాయకులు కె.కృష్ణారెడ్డి, బాదం శ్రీనివాస్, పాలాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

వికారాబాద్: మట్టి గణపతులను పూజిస్తూ పర్యావరణాన్ని కాపాడుదామని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని న్యూగంజ్ హనుమాన్ మందిర్‌దగ్గర మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు పట్టణం గాంధీ చౌక్‌లో శుక్రవారం వాసవీ మహిళా సంఘం, ఆర్యవైశ్య సంఘాలు సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ బోర్డు వారి సౌజన్యంతో తాండూరు మున్సిపల్‌చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ మట్టి వినాయకుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, కౌన్సిలర్లు స్రాహ శ్రీలత, వాసవీ మహిళా సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని చెంగోల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు మట్టి వినాయకున్ని తయారు చేశారు. హెచ్ఎం కిష్టప్ప వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వప్న, ఈశ్వరమ్మ, అనసూయ, నవీన, నర్మద పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురారివశిష్ట ఆధ్వర్యంలో స్థానిక మహాదేవ శివాలయం వద్ద మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఉషారాణి శుక్రవారం ప్రజలకు మట్టి వినాయకుడి ప్రతిమలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కటకం శివకుమార్‌గుప్త, మాజీ జడ్పీటీసీ భాస్కర్, దామోదర్‌రెడ్డి, రాజు, జయతీర్థచారి పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కొడంగల్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసే తిరుమలేష్ ఉపాధికోసం ప్రతీ సంవత్సరం వినాయక విగ్రహాలను తయారుచేసి అమ్మకాలు చేసేవాడు. దీంతో పాఠశాలలో చదివే విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహల తయారీపై శిక్షణ నిచ్చారు.

మోమిన్‌పేట్: వినాయక చవితి ఉత్సవాలకు మండపాలను ఉత్సవకమిటీ నిర్వాహకులు, సభ్యులు, యువజన సంఘాల సభ్యులు మండపాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. శనివారం(నేడు) వినాయకుడి ప్రతిష్ఠాపనకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం వివిధ గ్రామాల్లో మండపాలను ముస్తాబు చేశారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: మేడ్చల్ పట్టణ జాతీయ రహదారి పక్కన, ఎల్లంపేట గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయ విగ్రహాల దుకాణాల నుంచి విగ్రహాలను కొనుగోలు చేసుకోవటానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



మేడ్చల్ టౌన్: వాహనంలో మండపానికి తరలిస్తున్న వినాయక విగ్రహం

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ సంస్కృతి టౌన్‌షిప్‌లో కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు శుక్రవారం కాలనీ వాసులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

కీసర: వినాయక చవితి పురస్కరించుకొని మండల పరిధి రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మజ విద్యార్థులకు మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

పరిగి/దోమ: వినాయక మండపాల వద్ద కమిటీ సభ్యులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పరిగి సీఐ ఎన్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ఎస్పీ కె.నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంతోపాటు, అన్ని గ్రామాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గణనాథుని నిమజ్జనం అయ్యేవరకు రాత్రి సమయాల్లో గణేశుడి మండపం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు తప్పకుండా ఉండాలని సూచించారు. సింగిల్ ఎలక్ట్రిక్ వైర్లను జాయింట్ లేకుండా విద్యుత్ శాఖ ఏఈ సూచనలతో ఉపయోగించాలన్నారు. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండపంలోకి వర్షం నీరు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా గొడవలు జరిగితే అట్టి ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. డీజే సౌండ్‌కు అనుమతి లేదన్నారు.

దౌల్తాబాద్: వినాయక చవితి ఉత్సవాల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఎస్ఐ రవి గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మండలంలోని డీజే యజమానులకు అవగాహన కల్పించారు. పెద్ద సౌండ్ బాక్సులు పెట్టాలనుకునే ఉత్సవ కమిటీ నిర్వాహకులు పరిగి డీఎస్పీ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని తెలిపారు.

పూడూరు: మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక మండపాలకు తప్పక అనుమతి తీసుకోవాలని చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌లో మండల పరిధిలోని ఆయా గ్రామాల నాయకులు, వినాయక మంటపం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరపాలి

మేడ్చల్ టౌన్: గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావర్ణంలో జరుపుకునే విధంగా అన్ని చర్యలు చేపట్టామని మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక మండపాల నిర్వాహణకు వందకు పైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు పూర్తి వివరాలను స్థానిక పోలీస్టేషన్‌కు సమర్పించాలన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా వినా యక మండపాల వద్ద పోలీసులు భద్రతకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిమజ్జనానికి సంబంధించిన వివరాలు పోలీసులకు ముందుగా తెలియజేస్తే భద్రతా ఏర్పాట్లు చేపడుతామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'బస్తీబాట'



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు, సెప్టెంబరు 6: ప్రజా సమస్యల పరిష్కారానికే బస్తీబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో మల్‌రెడ్డిపల్లి, గొల్లచెరువు, పాత తాండూరు ప్రాంతాల్లో శుక్రవారం బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్, ఏఈలను ఆదేశించారు. పలు వార్డుల్లో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ సాహు శ్రీలత ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కాగ్నా నది నుంచి తాండూరు పట్టణానికి తాగు నీరు అందించేందుకు కొత్త పైప్‌లైన్ నిర్మాణం చేపట్టను న్నట్లు తెలిపారు. అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, పట్లోళ్ల నర్సింహులు, సాహు శ్రీలత, ప్రభాకర్‌గౌడ్, ధారాసింగ్, సుభాన్‌రెడ్డి, జుబేర్‌లాల, ఖాజాహుస్సేన్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే బస్తీబాటకు శ్రీకారం చుట్టిన రోజునే మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది.

మల్‌రెడ్డిపల్లి చెరువు పరిశీలన

తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లిలో నిమజ్జనం జరిగే చెరువును తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం ఎమ్మెల్యే మున్సిపల్, ఇరిగే షన్, పోలీస్‌శాఖ, అధికారులతో కలిసి పరిశీలించారు. మల్‌రెడ్డిపల్లి చెరువు వద్ద జరిగే నిమజ్జన ఏర్పాట్లపై మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గణేశ్ నిమజ్జనాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట నాయకులు కరుణం పురుషోత్తంరావు, డాక్టర్ సంపత్ కుమార్, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, కౌన్సిలర్ రామకృష్ణ (రాము) ఉన్నారు.

అభివృద్ధికి రూ.76.87లక్షలు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 6: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకోసం రూ.76.87లక్షల పనులకు తీర్మానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఇందులో ఎదులాబాద్ చెరువువద్ద వినాయక నిమజ్జనాల ఏర్పాట్లకు రూ.11లక్షలు. మున్సిపల్ సిబ్బందికి దుస్తులు, వివిధ రకాల వస్తువుల కొనుగోలుకు రూ.13.87లక్షలు, వైకుంఠధామాల అభివృద్ధికి రూ.50లక్షలు, డ్రైనేజీ మరమ్మతుకు రూ.2లక్షలు కేటాయిస్తూ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, సాబేర్‌అలీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్మాయిల్ ఖాన్‌గూడలో రూ, 22.50లక్షలు, యంనంపేట్‌లో రూ, 15లక్షలు, అన్నోజిగూడలోని ఎన్‌టీపీసీ చౌరస్తా వద్ద రూ, 30లక్షలతో నిర్మించనున్న వివిధ అభివృద్ధి పనులకు పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి శుక్రవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ నానవత్ రెడ్డియా నాయక్, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, నర్రి ధనలక్ష్మి, సింగిరెడ్డి సాయిరెడ్డి, సుర్వీ రవీందర్, ఏఈ మహిపాల్, నాయకులు శేఖర్, కాశయ్య, కేఎంరెడ్డి, బాలేష్, బుచ్చిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్, టీపీఎస్‌లపై కమిషనర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్, సెప్టెంబరు6: ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అనిత పలు అక్రమాలకు పాల్పడుతున్నందున తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు మాజీ పంచాయతీ సభ్యుడు మీసాల సుధాకర్‌రావు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే అనిత ఆమె సొంత అత్త మృతి చెందకుండానే మృతిచెందినట్లు మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి ఆవృద్ధురాలి పింఛన్‌ను నిలిపివేయించిందని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలతోపాటు, వెంచర్లు వెలిశాయన్నారు. అక్రమ కట్టడాలకు, వెంచర్లను స్థల పరిశీలన చేయకుండానే ఎన్‌వోసీలు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. టీపీఎస్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలలో నిర్మాణ అనుమతులు జారీచేస్తున్నారని వాపోయారు. కంప్యూటర్ ఆపరేటర్ అనితతో పాటు టీపీఎస్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని సుధాకర్‌రావు కమిషనర్‌ను కోరాడు.

బషీరాబాద్ ఎంపీడీవోగా విజయ్‌కుమార్

బషీరాబాద్, సెప్టెంబరు 6: బషీరాబాద్ ఎంపీడీవోగా ఎం.విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడా ఎంపీడీవో(ఎఫ్ఏసీ)గా పని చేసిన గాలి యాదయ్య యాలాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోగా విధుల్లో చేరారు. కొత్తగా విధుల్లో చేరిన ఎంపీడీవో పరిగి మండల పరిషత్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సంక్షిప్తంగా..

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ మండలం పూడూరు సేయింట్ మేరిస్ పాఠశాల విద్యార్థులు కండ్లకోయలో నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పాఠశాల ఉపాధ్యాయులు, కరాటే మాస్టర్ సుమన్‌గౌడ్‌లు శుక్రవారం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

● **మేడ్చల్ టౌన్:** కొత్త పెన్షన్ స్కీమ్‌ను వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటం చేసి యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను సాధించిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్ జనరల్ సెక్రటరీ, సౌత్ సెంట్రల్ రైల్వే స్టేషన్ ఎంప్లాయీస్ సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్యకు శుక్రవారం మేడ్చల్ రైల్వేఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు.

● **పెద్దేముల్:** ఈ నెల 9 నుంచి 23 వరకు మండల కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు పెద్దేముల్ మండల ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రెటరీ ఎం.శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్, రాధాక్రిష్ణ, రాజేందర్ పర్యవేక్షణలో కొనసాగుతాయన్నారు.

● **పరిగి:** ఈ నెల 9, 10 తేదీల్లో పరిగిలో జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు జరుగుతాయని పరిగి జోనల్ కార్యదర్శి జె.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిగిలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం దగ్గరలోని ఏఎస్ క్రికెట్ అకాడమిలో జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9948640187ను సంప్రదించాలని సూచించారు.

● **బొంరాస్‌పేట్:** దుద్యాల, హకీంపేట్ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం విజయలక్ష్మీ ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

● **వికారాబాద్/శామీర్‌పేట:** అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్, జడ్పీసీఈవో సుధీర్ హాజరయ్యారు. ఎంపీడీవో వినయ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అదేవిధంగా శామీర్‌పేటలోని వివిధ పాఠశాలలకు చెందిన 12మంది ఉపాధ్యాయులు, మూడుచింతలపల్లి మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా ఎంపీడీవో మమతాబాయి శుక్రవారం శామీర్‌పేట మండల పరిషత్‌లో ఎంఈవో వసంత కుమారి ఆధ్వర్యంలో సన్మానించారు.

● **శామీర్‌పేట:** పొన్నాల్ గ్రామాన్ని మూడుచింతలపల్లిలో విలీనం చేయొద్దని కాంగ్రెస్ నాయకులు డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని మొరపెట్టుకున్నారు. పొన్నాల్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింగ్‌రావుగౌడ్, అమరేందర్, మాజీ సర్పంచ్ కావాలి శంకర్, గ్రామ నాయకులు మహేందర్‌రెడ్డి, పాండుగౌడ్, బుచ్చిరెడ్డి, వినీత్ కలిశారు.

● **మేడ్చల్ టౌన్:** సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్ ఆర్టీసీ డిపోలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బృందం సభ్యులు శాంతి శోభ, రేణుక, సృజన, నరేష్, కిషోర్ పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో ఘట్‌కేసర్ మున్సిపల్ చర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ శుక్రవారం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు.

● **మేడ్చల్ టౌన్:** ఐటీఐ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థుల కోసం ఈనెల 9వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.హనుమ నాయక్ తెలిపారు.

● **శామీర్‌పేట:** నూతనంగా నియమితులైన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను శుక్రవారం తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అభినందిస్తు శుభాకాంక్షలను తెలిపారు.

● **పూడూరు:** కంకల్ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను శుక్రవారం ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు సన్మానించారు.

● **కొడంగల్:** శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వరహా స్వామి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు వరహా స్వామికి అభిషేకం నిర్వహించారు.

● **తాండూరు రూరల్:** జినుగుర్తి తెలంగాణ సోషల్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో శుక్రవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **కొడంగల్ రూరల్:** పౌష్టికాహారంతోనే చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దానమ్మ అన్నారు. మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషకాహార వారోత్సవాల్లో ఆమె మాటాడారు. కార్యక్రమంలో డాక్టర్ అమృత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణుకుమార్, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** తాండూరు మండలం జినుగుర్తి గ్రామంలో మంగలి లక్ష్మప్ప(65) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మత్‌అలీ మృతు కుమారుడు వెంకటప్పకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబసభ్యులకు మనోధైర్యం చెప్పారు. ఆయన వెంట గ్రామస్తులు భాస్కర్, నాగప్ప, నారాయణ, కిష్టప్ప వెంకటప్ప తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

నీటి సంపులో పడి బాలుడి మృతి

యాలాల, సెప్టెంబరు 6: నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని దౌలాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, యాలాల ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దౌలాపూర్ గ్రామానికి చెందిన వడ్డె వెంకటప్ప, మల్లమ్మలకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండవ సంతానమైన శివకుమార్(10) స్థానిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. వర్షాల కారణంగా వీరు నివాసముంటున్న ఇల్లు గతంలో కూలిపోయింది. ఈ సంవత్సరం కూడా భారీవర్షాలు పడడంతో గ్రామంలోని గ్రామపంచాయతీలో ఉండాలని గ్రామస్తులు సూచించారు. దీంతో వారు కుటుంబసభ్యులతో కలిసి గురువారం గ్రామపంచాయతీ భవనంలో ఆవాసం పొందుతున్నారు. శుక్రవారం ఉదయం వెంకటప్ప మల్లమ్మకుమారుడు శివకుమార్ గ్రామ పంచాయతీ భవనం ముందున్న సంపులోకి నీళ్ల తీసుకురావడానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు సంపులో పడి మునిగిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

దోమ, సెప్టెంబరు 6: రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలపాలై హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. మండలంలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన గార్లపల్లి కృష్ణ(24) గతనెల 30వ తేదీన బైక్‌పై పొలానికి వెళ్తున్నాడు. మల్లెపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ బైక్‌పై ఐనాపూర్‌కు వస్తుండగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. కృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి అన్న రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.

వాహనం ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

పూడూరు, సెప్టెంబరు 6: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూడూరు మండలంలోని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎండీ రఫీ ఈనెల 3వ తేదీన మన్నెగూడ నుంచి చెన్‌గోముల్ వెళ్లేమార్గంలో వాహనాల తనిఖీలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు మద్యం సేవించి విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ను తమ వాహనంతో ఢీ కొట్టి పరారయ్యారు. గాయాలపాలైన కానిస్టేబుల్‌ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తోటి కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మద్యం మత్తులో 108కు ఫోన్.. వ్యక్తిపై కేసు

బషీరాబాద్, సెప్టెంబరు 6: మద్యం మత్తులో ఓ వ్యక్తి 108 అబులెన్స్‌కు ఫోన్ చేసిన వ్యక్తిపై బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ గఫార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మంతన్‌గౌడ్ గ్రామానికి చెందిన బోయిని బాల్‌రాజ్ తన అమ్మ పకీరమ్మ ఆరోగ్యం బాగోలేదంటూ ఉదయం 7 గంటల సమయంలో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. అంబులెన్స్ వెంటనే గ్రామానికి చేరుకుంది. టెక్నీషియన్ సదరు వ్యక్తికి ఫోన్ చేయగా అందుబాటులో లేకపోగా, తన తల్లి ఇంట్లో ఉందని, తీసుకెళ్లాలని చెబుతుండటంతో చేసేదేమిలేక వెనుదిరిగిపోయారు. అంతలోనే 10గంటల సమయంలో మరోసారి సదరు వ్యక్తి ఫోన్ చేయగా తాండూరు పట్టణం నుంచి మరో అంబులెన్స్ గ్రామానికి వచ్చింది. ఆ సమయంలో కూడా అతడు లేకపోవడంతో విసుగెత్తిన అంబులెన్స్ సిబ్బంది ఫోన్ చేసిన వ్యక్తి బషీరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకుని పట్టుకున్నారు. అతడు మద్యం మత్తులో పొంతనలేని మాటలు చెప్పడంతో అంబులెన్స్ డ్రైవర్ కె.రాజు, టెక్నీషియన్ చౌహాన్‌సంజు అతడిని పోలీసులకు అప్పగించాడు. అంబులెన్స్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గఫార్ తెలిపారు.

మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

మూడుచింతలపల్లి, సెప్టెంబరు 6: మిస్సింగ్ కేసును శామీర్‌పేట్ పోలీసులు గంట వ్యవధిలోనే ఛేదించారు. సీఐ శ్రీనాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శామీర్‌పేట్‌లోని క్రిస్టిన్ ఆశ్రమం నుంచి 10సంవత్సరాల బాలుడు కనిపించకుండా పోయాడని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సీఐ శ్రీనాథ్ నేతృత్వంలో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి పెట్రోలింగ్ సిబ్బంది బాలుడిని ఆచూకీని కనుగొన్నారు. అనంతరం ఆశ్రమ అధికారులకు బాలుడిని సురక్షితంగా అప్పగించారు. అత్యంత వేగంగా ఘటనాస్థలానికి చేరుకుని బాలుడి ఆచూకీని గుర్తించిన పోలీసులకు ఆశ్రమ సిబ్బంది, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మొబైల్ ఫోన్లు రికవరీ

పరిగి, సెప్టెంబరు 6: తప్పిపోయిన మొబైల్ ఫోన్లను సత్వరమే రికవరీ చేస్తున్నామని పరిగి ఎస్ఐ సంతోష్ తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన మూడు ఫోన్లను రికవరీ చేశారు. శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, రాంప్రకాశ్‌లకు ఫోన్లను అందజేశారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నవారు వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు.

తాండూరులో రెండు డెంగీ కేసులు

తాండూరు, సెప్టెంబరు 6: తాండూరులో శుక్రవారం రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. వారం రోజుల కిందట ఒక కేసు నమోదైంది.తాండూరు పట్టణం మాణిక్‌నగర్ ప్రాంతం కోటమైసమ్మకు చెందిన బాలుడు కార్తీక్‌కు, ఇందిరానగర్ ప్రాంతం విలియమూన్ హైస్కూల్‌లో నివాసముంటున్న కలకత్తాకు చెందిన కార్మికుడు రాబిన్ ఖర్మారార్‌లకు డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వీరికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. మలేరియా టీం వెళ్లి స్ప్రే చేయడంతో పాటు మందులు అందజేశారు. వారం రోజుల కిందట సాయిపూర్ ప్రాంతంలో కూడ డెంగీ కేసు నమోదు అయినట్లు సమాచారం. సమాచారాన్ని బయటకు పొక్కకుండా వైద్యాధికారులు, మున్సిపల్ అధికారులు జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. తాండూరు ప్రాంతంలో ప్రస్తుత వాతావరణంలో మార్పుల ప్రభావంతో విష జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. ఆస్పత్రుల్లో ఓపీ పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేకవార్డు ఏర్పాటుచేసి ప్రత్యేక సిబ్బందిని 24గంటల పాటు పని చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువులో మొసలి కలకలం



మామిడికుంట తండా వద్ద ఏర్పాటు చేసిన సూచిక బ్యానర్

దౌల్తాబాద్, సెప్టెంబరు 6: మండలంలోని దేశాయిపల్లి గ్రామ శివారులో గల గుండ్లకుంట చెరువులో మొసలి కలకలం రేపింది. బుధవారం చెరువు గట్టుపై మేకలను మేపుతున్న కాపరులకు చెరువులో మొసలి కనిపించిందని గ్రామస్థులకు తెలిపారు. దీంతో చెరువు చుట్టు పక్కల గ్రామాలు, తండాల ప్రజలు భయంతో హడలిపోతున్నారు. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా శుక్రవారం చెరువు ప్రాంతంలో సూచిక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మొసలిని బంధించి తీసుకెళ్లాలని కోరారు.

అలుగు పారిన మెట్లకుంట చెరువు



కాకరవాణి ప్రాజెక్టుకు చేరిన వరదనీరు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 6: ఎడతెరిపి లేని భారీ వర్షాలతో బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట ఎల్లమ్మ చెరువు అలుగు పారుతోంది. వరద నీరు బొంరాస్‌పేట్ పెద్ద చెరువులోకి భారీగా రావడంతో ఏటి కాల్వ ద్వారా మెట్లకుంట చెరువులోకి నీరు ప్రవహించి అలుగు పారుతోంది. అదేవిధంగా కాకరవాణి ప్రాజెక్టు అలుగు పారడంతో మహంతీపూర్, మద్దిమడుగు తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపునీరు

పూడూరు: వర్షాలకు మండలంలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాల ఆవరణ చిన్నపాటి కుంటను తలపిస్తోంది. ఆవరణలో వర్షం నీరు నిలిచి విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విష జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతున్న వేళ నిలిచిన నీటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పాఠశాల తరగతి గదుల్లో కూడా బొంత పురుగులు వస్తున్నాయని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువు కట్టకు పడిన గండి పూడ్చివేత

కులకచర్ల: మండలంలోని ఇప్పాయిపల్లి చెరువుకు పడిన గండిని గ్రామస్థులు పూడ్చివేశారు. ఎడతెరిపి లేని భారీ వర్షాలతో చెరువుకు గండిపడింది. గమనించిన రైతులు, గ్రామస్థులు శుక్రవారం జేసీబీతో మరమ్మతులు చేపట్టారు. దీంతో చెరువు కట్టకు ప్రమాదం తప్పింది. చెరువు గత వారం రోజులుగా అలుగు పారుతుంది. చెరువు కింద ఆయకట్టు రైతులు కట్ట సంరక్షణ కోసం చర్యలు చేపట్టారు.

PUBLIC NOTICE

The General Public is hereby informing that Sri. B. Mallaiah S/o B Modileti R/o Sri Sai Nagar Colony, Tandur, Tandur, Vikarabad Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Tandur Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging his Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY. All that the House Bearing No.7-58 on Plot No.18 in. Admeasurig 160.0 sq. yds, Situated at Sri Sai Nagar Colony, Kokat Village,Yolal Mandal, Vikarabad Dist. And Bounded; **North:** Plot No.23. **South:** 33'-0" Wide Road. **East:** Plot No.17. **West:** Plot No.19. My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his/ her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

Sd/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates
off: 4-7-226/109, Sakethnagar,
Vikarabad, Vikarabad Dist - 501101, PH: 9246362213, 9603019574.

PUBLIC NOTICE

The General Public is hereby informing that Sri. **Emollu Raju S/o Emollu** Ashaiah R/o Gangaram, Vikarabad,Vikarabad Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Vikarabad Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that the Open Plot Sy No.9/AA/1 in Admeasuring 242.5 sq. yds, Situated at Machanpally Village, Vikarabad Mandal, Vikarabad Dist. And Bounded; **North:** 33'-0"Wide Road. **South:** Remaining Land of G.Bagaiah. **East:** Land of Anjamma. **West:** Land of Others Sy.No.9/Part. My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

Sd/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates
off: 4-7-226/109, Sakethnagar,
Vikarabad, Vikarabad Dist - 501101, PH: 9246362213, 9603019574.

PUBLIC NOTICE

The General Public is hereby informing that Smt. **Mudavath PanduS/o, Mudavath Thukya Naik** R/oRokati Gutta Thanda, Ippaipalle, Kulkacherla,Vikarabad Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Vikarabad Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that theHouse Bearing No.7-21/1,(1-7a21-1) in,Admeasurig 242.0 sq. yds, Situated at Ippaipalle Village & Gramapanchayath, Kulkacherla Mandal, VikarabadDist. And Bounded; **North:** Owner Land. **South:** Road and Owner Land. **East:** Owner Land. **West:** Owner Land. My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

Sd/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates
off 4-7-226/109, Sakethnagar,
Vikarabad Vikarabad, Dist - 501101, PH: 9246362213, 9603019574.

PUBLIC NOTICE

The General Public is hereby informing that Smt.**Pathan Nazma Pasha D/O Pathan Khareem** R/o Near V.V.M.G.H.S, Lingagari, Huzurnagar, Nalgonda Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Pargi Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that thePlot No.432/A,Sy.No.66/Part,Admeasurig 200.0 sq. yds, Situated at Peerlapally Village, Jagadevpur Mandal, SiddipetDist. And Bounded: **North:** Plot No.431/Part.**South:** 60'-0" Wide Road. **East:** Plot No.432/B.**West:** Plot No.433/Part. My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

Sd/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates
off 4-7-226/109, Sakethnagar,
Vikarabad Vikarabad, Dist - 501101, PH: 9246362213, 9603019574.

PUBLIC NOTICE

The General Public is hereby informing that Smt. **Varnasi Kistamma W/o, Venkataiah** R/o Dadapur, Doma, Vikarabad Dist. My Client M/s SHRIRAM FINANCE LTD. Pargi Branch. Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging her Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that the Open plot No.34 in Sy.No.337,Admeasuring 125.0 sq. yds, Situated at Dadapur Village & Gramapanchayath, Doma Mandal, Vikarabad Dist. And Bounded; **North:** 12 Feet's Road. **South:** Plot No.33. **East:** 9 Feet's Road. **West:** 9 Feet's Road. My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

Sd/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates
off: 4-7-226/109, Sakethnagar,
Vikarabad, Vikarabad Dist - 501101, PH: 9246362213, 9603019574.